క్లుప్తంగా

ఏఎస్ఐ వెంకటరమణ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ



ఏఎస్ఐ వెంకటరమణను సన్మానిస్తున్న పోలీసులు

కడప అర్బన్: పోలీసుశాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు మలిశెట్టి వెంకటరమణ 39 సంవత్సరాల పాటు సేవలను అందించడంతో పాటు, పరమాత్మ సేవా సంస్థను స్థాపించి స్వచ్ఛందంగా పలు సేవా కార్యక్రమాలను అందించారు. తన సేవా కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని నాలుగు సంవత్సరాల పాటు సర్వీసు ఉండగానే ఆయన స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేపట్టారు. ఈక్రమంలో సోమవారం ఏఎస్ఐ వెంకటరమణ పనిచేస్తున్న అన్నమయ్య జిల్లా నందలూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు.

సత్యనారాయణస్వామి వ్రతం నేడు

కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మీ సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. అధిక శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తులచే సామూహికంగా ఈ వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి భగవత్ విజ్ఞాపనం, మహా సంకల్పం, నవకలశ స్నపన తిరుమంజనం, తోమాలసేవ తదితర విశేష పూజాధికాలను నిర్వహిస్తామని, మధ్యాహ్నం 12 గంటలకు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు.

చేనేత కార్మికులకు ముద్ర రుణాలు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో అర్హులైన చేనేత కార్మికులకు సబ్సిడీ కింద ముద్ర రుణాలు ఇవ్వాలని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరనాల శివనారాయణ, ఓబులేశులు సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. మగ్గంపై ఆధారపడి జీవిస్తున్న చేనేత కార్మికులకు సబ్సిడీ కింద ముద్ర రుణాలు అందించాలని చేనేత జౌళిశాఖ అధికారులకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అర్హులను గుర్తించేందుకు సర్వే కూడా చేపట్టలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.

ఐసీడీఎస్ ఉద్యోగిపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్ : కమలాపురం సీడీపీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్య అవినీతిపై విచారణ జరపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బెల్లం మనోహర్ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. విధులు నిర్వర్తించాల్సినది కమలాపురంలో అయినప్పటికీ సీనియర్ అసిస్టెంట్ ఈశ్వరయ్య కడప ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలోనే ఉంటారన్నారు. వర్కర్లు, ఆయాల పదోన్నతుల విషయంలో వేలకు వేల రూపాయలు వసూలు చేసుకున్నారని ఆరోపించారు. ఎర్రగుంట్ల మండలం మాలేపాడు గ్రామంలో అర్హులైన ఆయాలకు పదోన్నతులు కల్పించాలని కోరారు.

విద్యార్థి మృతిపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్ : వీఎన్ పల్లె ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్న చరణ్ మృతి చెందడంపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాయక్, రాజేంద్రప్రసాద్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, వీరనాల శివకుమార్‌లు కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్‌ను వారు కలిసి ఫిర్యాదు చేశారు. విద్యార్థికి ఆదివారం వాంతులు, విరేచనాలు కావడంతో సోమవారం ఉదయం ఆరోగ్యం క్షీణించడంతో హాస్టల్ సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతి చెందాడని తెలిపారు. హాస్టల్ లో రెగ్యులర్ వార్డెన్ ఉంటే ఇది జరిగేది కాదన్నారు. విద్యార్థి కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

క్యాంటీన్‌లో వస్తువులు అందుబాటులో ఉంచాలి



వినతి పత్రం సమర్పిస్తున్న ఫిలిప్స్ తదితరులు

కడప రూరల్: మాజీ సైనికుల క్యాంటీన్‌లో అన్ని రకాల వస్తువులు అందరికీ అందుబాటులో ఉంచాలని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ వెటరన్స్ సొసైటీ అధ్యక్షులు జడ్ ఫిలిప్స్ తెలిపారు. ఆ మేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తగినంత స్టాక్ ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సొసైటీ ఉపాధ్యక్షులు శేఖర్, సభ్యులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని అక్కాయపల్లె, చెమ్ముమియ్యాపేట, సాయిపేట ప్రాంతాల్లో తాగు నీటి సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్లు పాకా సురేష్ కుమార్, బాలస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు జమాల్‌వలీ, చల్లా రాజశేఖర్, రెడ్డి ప్రసాద్, రామక్రిష్ణారెడ్డి కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డికి వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్ద పైపులైన్ నుంచి చిన్నపైపులకు ఇంటర్ కనెక్షన్ ఇవ్వడం వల్లే పైపులు పగిలిపోతున్నాయన్నారు. దీనివల్ల అన్ని ప్రాంతాల్లో నీటి సమస్యలు ఏర్పడే పరిస్థితి తలెత్తిందని, వెంటనే పైపులైన్లకు మరమ్మతులు చేసి నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

– కడప నగరంలోని మాచుపల్లి రోడ్డులో ఉన్న రూములను రోడ్డు విస్తరణలో తొలగించాలని బిఐ ప్రసన్న కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన 'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 45 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగం-11, టౌన్‌ప్లానింగ్-9, రెవెన్యూ విభాగం-5, హెల్త్ విభాగం-4, యూపీఏ విభాగం-2, సచివాలయం విభాగం-1, ఐసీడీఎస్-1, కడప తహసీల్దార్-5, సీకే దిన్నె తహసీల్దార్-2, హౌసింగ్-4, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్-1 అర్జీలు వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సిటీప్లానర్ సూరజ్ కుమార్, ఈఈ నారాయణ స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డితో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు

కడప కార్పొరేషన్: కడప నగరం మాచుపల్లె రోడ్డులో ఉక్కాయపల్లె పాత కంపోస్టు యార్డు వద్ద ప్రధాన పైపులైన్ పగిలి పెద్ద ఎత్తున తాగు నీరు వృథాగా ప్రవహిస్తుండేవి. దీనిపై గత నెల 29వ తేది సాక్షి పైపులైన్ లీకేజీ పేరుతో వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన నగరపాలక అధికారులు సోమవారం పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టారు.

తాగునీటి ఎద్దడి

పైపులైన్ మరమ్మతు పనుల వల్ల కడప నగరంలోని అక్కాయపల్లె, చెమ్ముమియ్యాపేట, సాయిపేట ఏరియాలకు తాగునీటి ఎద్దడి నెలకొంది. మరమ్మతులు చేస్తున్నప్పటికీ మళ్లీ లీకేజీ అవుతుండటంతో దానిని పూర్తిగా ఆపేసి 500ఎంఎం డీఏ పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. పైపులైన్‌కు రెండు రోజుల్లో సంపూర్ణంగా మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేస్తామని, అంతవరకూ నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు నగరపాలక అధికారులు తెలిపారు.



పైపులైన్ పగిలిపోయి భారీ స్థాయిలో బయటికి వస్తున్న నీరు



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

విద్యుత్ బిల్లుల డిజిటల్ చెల్లింపులపై అవగాహన

– ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ



మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: జిల్లాలో వినియోగదారులు విద్యుత్ బిల్లులను డిజిటల్ రూపంలో ఆన్‌లైన్‌లో చెల్లించేలా అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ ఆదేశించారు. సోమవారం కడప విద్యుత్ డివిజన్ పరిధిలోని సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల్లో వ్యత్యాసాలు లేకుండా ఆటో మేటిక్ బిల్లింగ్(ఐఆర్‌డీఏ) పద్ధతి ద్వారా ప్రతి ఒక్క సర్వీసుకు బిల్లులు ఇవ్వాలన్నారు. ఇంటి లోపల ఉండే మీటర్లను బయటకు మార్పించాలన్నారు. నిర్దిష్ట కాలంలో విద్యుత్ బిల్లుల బిల్లింగ్ పూర్తి చేయుటకు అవసరమైతే కొత్తగా స్పాట్ బిల్లర్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. విద్యుత్ స్తంభాలను తాకకుండా ఉండాలని, తెగిపడిన విద్యుత్ వైర్లను తాకవద్దన్నారు. విద్యుత్‌ను కొక్కెముల ద్వారా కాకుండా నాణ్యమైన సర్వీస్ వైరు ద్వారా స్తంభం నుంచి మీటర్ వద్దకు తీసుకోవాలన్నారు. ఎలాంటి మరమ్మతులైనా విద్యుత్ శాఖ సిబ్బందితో చేయించుకునే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించి, ప్రమాదాలను అరికట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. నరసింహ ప్రసాద్, డీఈఈలు, ఏఈలు, ఏఓలు పాల్గొన్నారు.

నీటిపారుదల రంగంపై నిర్లక్ష్యం తగదు

కడప వైఎస్సార్ సర్కిల్: రాయలసీమలోని నీటి పారుదల ప్రాజెక్టులపై పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాటాడుతూ రాయలసీమ నీటిపారుదల ప్రాజెక్టులు గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, రాజోలి, వెలుగొండ ప్రాజెక్టులకు తగినన్ని నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి

– ఎల్ఐసీ నేతల డిమాండ్

కడప కల్చరల్ : మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించాలని, సామాన్య ప్రజలకు రక్షణ కల్పించి మహిళలపై దారుణాలకు తెగబడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని ఇన్సూరెన్స్ యూనియన్ల నేతలు రఘునాథరెడ్డి, చంద్రపాల్ కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన ప్రదర్శనలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మూడు నెలలుగా అల్లకల్లోల పరిస్థితి నెలకొని ఉందని, సామాన్యప్రజలు భయంతో గడుపుతున్నారని తెలిపారు. ఆదివాసులకు, మైదాన ప్రాంత ప్రజలకు మధ్య తగువులు పెట్టి రాజకీయ నాయకులు పబ్బం గడుపుకోవాలని చూడటం తగదన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన ఆదివాసి హక్కులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పాలకులదేనన్నారు. ఏ మతమైనా, ఏ తెగ వారైనా అందరూ భరతమాత బిడ్డలేనని, వారి హక్కులను కాపాడటం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. కార్యక్రమంలో యూనియన్ల నేతలు అవధానం శ్రీనివాస్, అక్బర్, వారిజాతమ్మ, అమీనా పర్వీన్, మూర్తి, శ్రీధర్, రమణ, రాజు, శ్రీవాణి, వసుప్రద, శ్రీకృష్ణ, కుమార్ పాల్గొన్నారు.



నిరసన ప్రదర్శనలో ఇన్సూరెన్స్ యూనియన్ నేతలు

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి సన్మానం

కడప అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన పి. అన్నపూర్ణను జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయవాదుల సంఘం భవనంలో న్యాయవాదుల సంఘం , న్యాయసేవాసదన్‌లో ఉద్యోగుల సంఘం సోమవారం ఘనంగా సన్మానించింది. ఆమె ఉద్యోగ విరమణ సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి అన్నపూర్ణ మాట్లాడారు. న్యాయవాదిగా, న్యాయమూర్తిగా వివిధ హోదాల్లో అందరి సహకారంతో పనిచేశామన్నారు. కడపలో న్యాయవాదులు ఎంతగానో సహకరించారన్నారు. కేవలం 30 రోజులు మాత్రమే పనిచేశానన్నారు. కడప నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గీత, కడప ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కవిత, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్‌కుమార్, న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు జీ.వి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.ఎస్. బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం సన్మానం:

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. అన్నపూర్ణను సోమవారం జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన పరిపాలనా అధికారి క్రిష్ణారావు, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డి. భాస్కర్, ప్రధాన కార్యదర్శి నారప రెడ్డి, ప్రతినిధులు క్రిష్ణప్రసాద్, శ్రీనివాసగుప్త, అహ్మద్‌బాషాలు పాల్గొన్నారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నపూర్ణను సన్మానిస్తున్న న్యాయశాఖ ఉద్యోగుల సంఘం

చిరుధాన్యాల సాగుపై అవగాహన పెంచాలి

– రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే చిరుధాన్యాల సాగుపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఊటుకూరులోని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో చిరుధాన్యాల సాగుపై జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికి జిల్లాలో 33 శాతం మేర మాత్రమే వర్షపాతం నమోదయిందని.. ఈ తక్కువ వర్షపాతంకు అనుగుణంగా చిరుధాన్యాల సాగు చేయడం మంచిదని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి చిరుధాన్యాల సాగును పెంచాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒకప్పుడు రాయలసీమ మిల్లెట్ హబ్‌గా ఉండేదన్నారు. మళ్లీ చిరుధాన్యాల సాగును పెంచేందుకు కృషి చేస్తామన్నారు. కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య మాట్లాడుతూ 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా పేర్కొన్నారన్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలో చిరు ధాన్యాల సాగును పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ మురళీకృష్ణ మాట్లాడుతూ నేడు 60 శాతం మంది జనాలు షుగర్‌తో బాధపడుతున్నారన్నారు. చిరుధాన్యాలు షుగర్ వ్యాధి గ్రస్తులకు ఎంతో మేలు అన్నారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కడప, అన్నమయ్య జిల్లాలలో మండలస్థాయిలోని ఆర్‌బీకే కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ రామక్రిష్ణరాజు మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్ ద్వారా చిరుధాన్యాల ప్రోత్సాహానికి మినీకిట్స్‌ను సరఫరా చేస్తే బాగుంటుందని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిసి డీడీఏ రమణారెడ్డి, ఆత్మ డీపీడీ పద్మలత, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బందితోపాటు ఏటీఎంలు, బిటిఎంలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ధర్నా

కడప వైఎస్సార్ సర్కిల్: బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యా సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం ఈ మేరకు నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017 అక్టోబర్ నెలలో కేంద్ర ప్రభుత్వం 17 పింఛనుదారుల సంఘాలతో పలు నిర్ణయాలను తెలియజేసిందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరిస్తూ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ పట్ల వివక్షత చూపుతోందన్నారు. దాదాపు 5 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ ఎంటిఎన్ఎల్ పెన్షనర్లు అధికారుల ఉదాసీనత నిర్లక్ష్యం వల్లన పెన్షన్ రివిజన్ పొందకుండా ఉన్నారన్నారు. పింఛను సవరణకు సంబంధించిన చట్టబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 21 నుంచి 25 వరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నాను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్, సంచార్ నిగమ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సుబ్బారెడ్డి, ఈశ్వరయ్య, కొండన్న పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ ఉద్యోగులు

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : కాంట్రాక్టు విద్యుత్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, ఏఐటీయూసీ నాయకుడు కేసీ బాదుల్లా కోరారు. ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులు ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం ప్రభుత్వంలో 25 సార్లు చర్చలు జరిపినా ఎలాంటి స్పందన లేదన్నారు.

ఇప్పటికైనా విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన న్యాయపరమైన సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 7న తిరుపతిలోని ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ట్రేడ్ యూనియన్ నాయకులు నాగమల్లయ్య, వెంకటేశ్, హరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీలకు భూములు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో నిరుపేద ఎస్సీ ఎస్టీ బీసీ కులాల వారికి వ్యవసాయ భూములు మంజూరు చేయాలని జిల్లా దళిత అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం నాయకుడు వీఆర్ శంకర్, బీసీ మహాసభ జాతీయ కన్వీనర్ అవ్వారు మల్లికార్జున కోరారు. సోమవారం కడప ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి అనంతరం ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించామన్నారు. దీంతో ఆయన స్పందించి కమలాపురం, వల్లూరు, సీకే దిన్నె, చెన్నూరు, రాజుపాలెం మండలాల్లో భూములు లేని ఎస్సీ ఎస్టీ బీసీలను గుర్తించి జాబితా తయారు చేయించారని పేర్కొన్నారు. అయితే అర్హులకు భూములు పంపిణీ చేయడంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. కనుక ఇప్పటికైనా త్వరగా వ్యవసాయ భూములు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ ఎస్సీ ఎస్టీ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు జేవీ రమణ, పీవీ రమణ, వైఎం ప్రతాప్ రెడ్డి, లంబోదర్, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహిస్తున్న దళిత నాయకులు

జేవీవీ నగర అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక (జేవీవీ) కడప నగర అధ్యక్ష, కార్యదర్శులను సోమవారం రవీంద్రనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఎంపిక చేసుకున్నారు. నగర అధ్యక్షులుగా శివరాం, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కుమార్, కోశాధికారిగా గోవింద్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ దేశంలో హింస, మూఢ నమ్మకాలు పెరిగిపోతున్నాయని, వీటిని ఎదుర్కొనేందుకు సైన్స్ ప్రచారం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ ప్రసాద్‌రాజు, నిర్మల, గౌరవ సలహాదారులుగా కుమారస్వామిరెడ్డి, భాస్కర్, ఉపాధ్యక్షులుగా అబ్బాస్ అలీ, వసంత్, రామాంజనేయరెడ్డి, కామేశ్వరమ్మ, బండి ప్రసాద్, కార్యదర్శులుగా ప్రకాశ్, ధనరాజ్, గోపినాథ్, కలీం, వలీ, మధుసూదన్, కరీముల్లా తదితరులు ఎంపికైనట్లు తెలిపారు.

బిషప్ అరుళయ్య సేవలు మరువలేనివి

కడప కల్చరల్ : రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవ సేవా సంస్థల ప్రతిష్టను పెంచేందుకు బిషప్ అరుళయ్య ఎంతో కృషి చేశారని, ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు మడగలం ప్రసాద్ తెలిపారు. బిషప్ అరుళయ్య 20వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం మరియాపురం జూనియర్ కళాశాలలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంతోపాటు ఆరోగ్యమాత కాన్వెంట్ సభ ఆధ్వర్యంలోనూ, మరియాపురం పెద్ద చర్చిలోనూ, మాసాపేట డాన్‌బాస్కోలలో ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలి

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని బాలాజీనగర్‌లో ఉన్న సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహానికి రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కార్యదర్శి ఓబయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఏఐఎస్‌బి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హాస్టల్ ఎదుట విద్యార్థులతో కలిసి ఆందోళన చేశారు. అధికారులు స్పందించి సమ స్య పరిష్కరించాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌లలో సీసీ కెమెరాలు

– కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



సీసీ కెమెరాల గురించి వివరిస్తున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్: కడప పోలీస్‌సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ తెలియజేశారు. సోమవారం సాయంత్రం కడప డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి మానిటరింగ్ చేసే విధంగా సీసీ కెమెరాలను ప్రతి పోలీస్‌స్టేషన్ ఆవరణంలోనూ, లోపలున్న గదులు, ప్రదేశాల్లో ఏర్పాటు చేశారన్నారు. వాటి పనితీరును, నిఘాను కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షిస్తారన్నారు.

న్యాయం చేయండి

కడప రూరల్: స్థల ఆక్రమణకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని కడప నగరం కృష్ణప్ప నగర్‌కు చెందిన వృద్ధురాలు అన్నయ్య గారి సంపత్‌కుమారి కోరారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కడప నగరం నాగరాజుపేటలో తనకు 15 సెంట్ల స్థలం ఉందన్నారు. తన స్థలానికి పక్కనే గల ఒక వ్యక్తి తన స్థలంలో మూడు సెంట్ల మేరకు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. తనకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ దత్తసాయి తదితరులు పాల్గొన్నారు.

ఘన నివాళి

కడప కల్చరల్ : మహాగాయకుడు మహమ్మద్ రఫీ 73వ వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు నివాళులర్పించారు. స్థానిక హుమయున్ బాషా ఆర్ట్స్ కార్యాలయంలో స్థానిక గాయకులు హుమయున్ బాషా ..జానమద్ది హనుమచ్ఛాస్త్రి మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్‌తో కలిసి మహమ్మద్ రఫీ చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఆయన ఆలపించిన పలు సినీ గీతాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో కరీముల్లా, శివకుమార్, అన్వర్‌బాష పాల్గొన్నారు.